ప్రజల మాట ప్రగతి బాట

కొత్తగూడెం నియోజకవర్గం

## కొత్తగూడెం ఏరియాలో డీఎఫ్‌వో కిష్టాగౌడ్ పర్యటన


జీకేవోసీలో సేఫ్టీజోన్ ఏరియాను మ్యాప్‌లో పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

రామవరం, అక్టోబర్ 19: జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్ సింగరేణి కొత్తగూడెం ఏరియాలో గురువారం పర్యటించారు. జీకేవోసీ 7.5 మీటర్ల సేఫ్టీ జోన్ ఏరియా ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా ఏరియా జీఎం కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో జీకేవోసీ 7.5 మీటర్స్ సేఫ్టీజోన్ ఏరియా మ్యాప్‌లను పరిశీలించి జీఎం శాలెంరాజు డీఎఫ్‌వోతో చర్చించారు. అనంతరం ఫీల్డ్‌కు వెళ్లి తనిఖీ చేశారు. ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, పద్మావతి ఖని ఏజెంట్, ప్రాజెక్టు ఆఫీసర్ జీకేవోసీ శ్రీరమేష్, ఏరియా సర్వే ఆఫీసర్ సదానందం, డీజీఎం ఫారెస్టు హరినారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ తావుర్యా, ఫారెస్టు డివిజనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఉమా, జీకేవోసీ మేనేజర్ మురళి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థినికి సింగరేణి అధికారుల ఆర్థిక సాయం


వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు

రామవరం, అక్టోబర్ 19: ఓ వైద్య విద్యార్థినికి సింగరేణి అధికారులు, ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మపేటకు చెందిన గడ్డం శృతి.. ఖమ్మం మమతా మెడికల్ కాలేజీలో మెడిసిన్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లి కూలి పనులు, కుట్టుమిషన్ పనులు చేస్తూ శృతిని చదివిస్తోంది. ప్రస్తుతం ఆమెకు పరీక్ష ఫీజు, ఇతర ఖర్చులకు ఆర్థిక వనరులు ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధి శృతి ఆర్థిక సమస్యను సింగరేణి పద్మావతిఖని మైన్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు మేనేజర్ సానుకూలంగా స్పందించి ఉద్యోగులు, అధికారులతో చర్చించి వారి వేతనం నుంచి ప్రతి నెలా రూ.50 చొప్పున సోషల్ వెల్ఫేర్ ఫండ్ కోసం కేటాయించారు. అలా కేటాయించిన రూ.35 వేల నగదును చెక్కు రూపంలో విద్యార్థిని శృతికి గురువారం అందించారు. ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, అధికారులు రవీందర్, శర్మ, పాలడుగు శ్రీనివాస్, శివకేశవరావు, ఎస్ఎస్‌వో రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లీకొడుకుపై దాడి: కేసు నమోదు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 19: భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి తల్లీ కొడుకులకు గాయాలైన ఘటన మండలంలోని పాండురంగాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాండురంగాపురానికి చెందిన ఆడెపు దయాకర్, అతడి తల్లి ఏసమ్మ బుధవారం సాయంత్రం పొలం నుంచి ట్రాక్టర్‌లో తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన పచ్చిపాల రాములు, భాస్కర్‌లు వీరి ట్రాక్టర్‌ను అడ్డగించారు. రహదారి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాములు, భాస్కర్‌లు ట్రాక్టర్ నడుపుతున్న దయాకర్‌ను కిందికి లాగి వెంట తెచ్చుకున్న కోట కత్తితో అతడిపై దాడి చేశారు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. ఇంతలో దయాకర్‌ను రక్షించేందుకు అతడి తల్లి ఏసమ్మ మధ్యలో వచ్చేసరికి ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించారు. అదే సమయంలో సమీపంలోని పొలాల నుంచి ఇళ్లకు వెళ్తున్న వారు సరికి రాములు, భాస్కర్ పరారయ్యారు. చికిత్స అనంతరం ఏసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొత్తగూడెం పట్టణంలో అభివృద్ధి పనుల పరిశీలన

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 19: మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను డీఈ రవికుమార్ గురువారం పరిశీలించారు. పట్టణంలోని హనుమాన్‌బస్తీ, బూడిదగడ్డ, కూలీలైన్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయిన్లు, సీసీ రోడ్లు తదితర పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. వార్డుల్లోని మురుగు కాలువల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని, చెత్తా చెదారం అంతా కాలువల్లో ఉండిపోతోందని బస్తీవాసులు డీఈ దృష్టికి తీసుకువచ్చారు. కాలువల్లోని వ్యర్థాలను తొలగించి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ వేయాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు.


కూలీలైన్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ రవికుమార్

ఎన్నికల విధుల్లో

# మరింత బాధ్యతగా ఉండాలి

- 'నియమావళి'ని ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరించాలి
- నేర సమీక్ష సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ డాక్టర్ వినీత్


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 19: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు వచ్చినా వెనుకడుగు వేయవద్దని, ప్రతి పోలీసు అధికారీ బాధ్యతగా పని చేయాలని భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో తన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకునేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు నగదు, మద్యం సహా ఇతరాత్ర ఆశలను ఎరగా చూపించి ప్రలోభాలకు గురి చేసే వారిపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘవిద్రోహక శక్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ర్యాలీలు, సభలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వాటిని స్థితిని తాను కూడా పరిశీలిస్తానని చెప్పారు. అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు చేస్తున్న దోపిడీపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చైతన్యం కలిగించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్లలో విధి నిర్వహణలో ప్రతిభను కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

**సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించాలి**

ఫ్లాగ్ డే సందర్భంగా ఈ నెల 21 నుంచి 30 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్పీ వినీత్ సూచించారు. వ్యాసరచన పోటీలు, ఆన్‌లైన్ ఓపెన్ హౌజ్, ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలను వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టీ.సాయిమనోహర్, ఏఎస్పీలు, డీఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పంకజ్ పరితోశ్, ఎన్.వెంకటేశ్, రమణమూర్తి, రాఘవేంద్రరావు, మల్లయ్యస్వామి, ఏ.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


## పాల్వంచలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 19: ఎన్నికల సందర్భంగా మండలంలోని 36 పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు గురువారం పరిశీలించారు. రేగులగూడెం నుంచి దంతెలబోర వరకు 33 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నోడల్ అధికారి సత్యనారాయణ, ఎంపీడీవో అప్పారావు, ఏపీవో రంగా, సెక్టోరియల్ అధికారులు మురళి,, రాణి, మంగు, చంద్రశేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచ మండలం తోగ్గూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# ధనలక్ష్మీదేవి రూపంలో అమ్మవారు

- పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయంలో సువర్ణ పుష్పార్చన
- నియోజకవర్గ వ్యాప్తంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు


పాల్వంచ రూరల్, కొత్తగూడెం అర్బన్, జూలూరుపాడుల్లో వివిధ రూపాల్లో అమ్మవార్లు

పాల్వంచ రూరల్/ కొత్తగూడెం అర్బన్/ పాల్వంచ/ జూలూరుపాడు/ కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 19: మండలంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదో రోజు గురువారం అర్చకులు ప్రాతఃకాల అర్చనలతోపాటు ఇతర ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగశాలలో హోమాలు నిర్వహించారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో ప్రత్యేక అర్చన చేశారు. 'ధనలక్ష్మి' రూపంలో శ్రీకనకదుర్గ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏడు దేవాలయాలకు పెద్దమ్మతల్లి ఆలయం నుంచి 'సారె' ను అందజేశారు. సాయంత్రం ఆత్మలింగేశ్వర ఆలయ బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. దేవాదాయ శాఖ కొత్తగూడెం పరిశీలకుడు భేల్ సింగ్, ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

**అన్నపూర్ణాదేవిగా అమ్మవారు**

కొత్తగూడెం మున్సిపాలిటీ పాత కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మంటపంలో అమ్మవారు గురువారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

**లలితా పరమేశ్వరిగా..**

జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం, సూరారం, జూలూరుపాడు, గుండెపుడి, పాపకొల్లు గ్రామాల్లో కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో గురువారం ఐదో రోజు అమ్మవారు లలితా పరమేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**మహాలక్ష్మి దేవిగా అమ్మవారు**

కొత్తగూడెం శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయంలోని స్వర్ణదుర్గ అమ్మవారు గురువారం ఐదో రోజు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

**పాల్వంచలో..**

పాల్వంచ శాస్త్రీరోడ్‌లో, గట్టాయిగూడెంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపాల్లో గురువారం ప్రత్యేక హోమ పూజలు నిర్వహించారు.

**ముత్యాలమ్మ తల్లికి పెద్దమ్మతల్లి ఆలయం సారె**

పాల్వంచ గాంధీనగర్ 5వ వార్డులో పెద్దపాల చెట్టు కింద ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ఏటా కొనసాగే ఆనావాయితీ ప్రకారం పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి దేవాలయం నుంచి పట్టువస్త్రాలు, చీరెలు, సారెలు, పసుపు, కుంకుమలను గురువారం అందించారు. ధర్మకర్తల మండలి సభ్యులు మేళతాళాలతో వీటిని తీసుకొచ్చి ముత్యాలమ్మ తల్లికి సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


పాల్వంచ: పూజలు చేస్తున్న భక్తులు


పాల్వంచలో ముత్యాలమ్మకు సారె తెస్తున్న భక్తులు, పాల్వంచ, కొత్తగూడెం టౌన్‌లలోని మండపాల్లో హోమ పూజలు చేస్తున్న భక్తులు